76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

'రాజధాని వార్తలు' పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94406 62699
76809 94755
www.rajadhanivartalu.com

# రాజధాని వార్తలు

Voice of Voiceless

Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
ఏపీలో ప్రఖ్యాతిగాంచిన చింతలూరు ఆయుర్వేద వైద్యులు,
సంతానరాహిత్య సమస్యలకు సంప్రదించండి
ph : 90329 90138, 93939 90138
email :dr.d.vishwanath@gmail.com
AYYAPPA AYURVEDIC SYNDICATE
Visakhapatnam

అమరావతి సంపుటి : 4 సంచిక 21, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 11 - ఆదివారం 17 ఫిబ్రవరి, 2019

వివరాలు2లో...

కబ్జాకోరల్లో మంగళగిరి

వివరాలు3లో...

అరుణిమా సిన్హాకు అభినందనలు

వివరాలు4లో...

వెనిజులాపై అగ్రరాజ్యాల అక్కసు

వివరాలు4లో...


రగులుతున్న ఈశాన్యం

# మామిడికి మంచు దెబ్బ

**• తేనె పురుగు ఉధృతి • రైతు దిగాలు**



**రాజధాని వార్తలు డెస్క్ :** రియల్ ఎస్టేట్ వ్యాపారుల పుణ్యమా అని రాష్ట్రంలో ఎడాదికి ఏడాది మామిడి తోటల విస్తీర్ణం తగ్గి సగటు మానవుడికి మామిడికాయలు అందడం లేదు. దీనికి తోడు ఈ ఏడాది వాతావరణం మామిడి తోటలకు ప్రతికూలంగా మారుతోంది. వాతావరణ మార్పులతో పూత ఇప్పటికీ సరిగ్గా రాలేదు. కొద్ది రోజుల నుంచి పొగమంచు తీవ్రత పెరగడంతో తోటల్లో తేనేమంచు పురుగు ఉధృతి పెరిగింది. చీడపీడలను అరికట్టడానికి రైతులు వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు వినియోగిస్తున్నా.. ఫలితం ఉంటుందో.. ఉండదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లా తరువాత కృష్ణాజిల్లాలోనే మామిడి అత్యధికంగా సాగవుతోంది. జిల్లావ్యాప్తంగా దాదాపు 1.70 లక్షల ఎక రాల్లో మామిడి సాగవుతోంది. చిన్నరసాలతో నూజివీడు పేరు ప్రపంచ గుర్తింపు పొందింది. ఈ ప్రాంతంలో 60 శాతం మంది రైతులు మామిడిని ప్రధాన సాగుగా చేపడుతున్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా వచ్చే 30 నుంచి 40 లక్షల టన్నుల దిగుబడిలో కృష్ణాజిల్లా నుంచి ప్రత్యేకంగా నూజివీడు నుంచే 60 శాతం దిగుబడి అవుతోంది. ఇక్కడ పండే చిన్న, పెద్ద రసాలతో పాటు హిమాయతీలకు జాతీయ, అంతర్జా తీయంగా డిమాండు ఉంది. రసాలతో పాటు బంగినపల్లి, ముంత మామిడి, తోతాపురి ఎక్కు వగా లభిస్తున్నాయి. చాట్రాయి, విస్సన్నపేట, రెడ్డి గూడెం, తిరువూరు, గంపలగూడెం, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు, మైలవరం మండలాల్లో మామిడి విస్తారంగా సాగవుతోంది.

నూజివీడు, మైలవరం, తిరువూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని తోటల్లో ఏటా మొదటి కాపు వస్తుంది. మార్చిలో మామిడికోతలు కూడా తొలిదశలో వచ్చిన కాయలను కోసి రైతులు అమ్ముతుంటారు. సాధారణంగా తోటల్లో డిసెంబర్, జనవరి నెలల్లో అధికంగా పూత వస్తుంది. 2018 డిసెంబర్ నెలలో పెథాయ్ తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. ఒక్కసారిగా వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గాయి. జనవరి 20 తరువాతే ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరాయి. జనవరి నెలాఖరుకు తోటల్లో పూత కనిపించింది. అయితే ఒక్కసారిగా పొగమంచు పెరిగింది. దీంతో తోటల్లో తేనేమంచు పురుగు ఉధృతి పెరిగి పూతను దెబ్బ తీస్తోంది. సాధారణంగా ఎకరానికి సగటున 8 నుండి 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది వాతావరణం ప్రతికూలంగా మారడంతో ఎకరానికి 5 టన్నుల నుంచి 7 టన్నుల మధ్య మాత్రమే దిగుబడులు వచ్చే పరిస్థితి. అంటే ఎకరానికి 2నుండి 3 క్వింటాళ్లు వరకు దిగుబడులు తగ్గనున్నాయి. మొత్తం విస్తీర్ణంలో 60 వేల ఎకరాల పైబడి బంగినపల్లి రకం చెట్లున్నాయి. బంగినపల్లి రకం ఒక ఏడాది కాపు అధికంగా వస్తే మరుసటి ఏడాది దిగుబడి తగ్గుతుంది. దీన్ని రెస్ట్ పీరియడ్‌గా పేర్కొంటారు. గత ఏడాది కాపు అధికంగా వచ్చినందున ఈ సంవత్సరం పూత రాలేదు.

**పూత అలస్యంతో సమస్యలు**

ఫిబ్రవరిలో పూత వస్తే మే చివరలో కానీ, జూన్ మొదటి వారంలో కానీ కాయల దిగుబడి వస్తుంది. రుతు పవనాలు ప్రారంభమ య్యే ఈ సమయంలో ఈదురు గాలులు,వర్షాలు అధికంగా ఉంటాయి. ముందస్తు వర్షాలు కురిస్తే మామిడికి టెంకె పుచ్చు పురుగు, మంగు తెగులు ఆశిస్తుంది. నాణ్యత చెడిపోతే కాయలు పచ్చడికి పనికిరావు. ఈ క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

మరో సర్వేలోనూ

# వైసీపీదే హవా !



**రాజధాని వార్తలు :** ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష వైసీపీకి అనుకూలంగా మరో సర్వే బయటికొచ్చాయి. ఈ దఫా ఏపీలో జగన్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని వీడీపీ అసోసియేట్స్ సర్వే తేల్చేసింది. అధికార టీడీపీకి ఘోర పరాభవం ఎదురు కాక తప్పదని అంచనా వేసింది. జనసేన సీట్లు సాధించకపోయినా.. టీడీపీ ఓటమిలో కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడింది.

వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారాన్ని కోల్పోవడం ఖాయమని ఇండియా టుడే, టైమ్స్ నౌ వంటి సర్వేలు ఇప్పటికే తేల్చిన సంగతి తెలిసిందే. తాజాగా వీడీపీ అసోసియేట్స్ సర్వే కూడా అదే తరహా ఫలితాలను వెల్లడించింది. వైసీపీ తిరుగులేని మెజారిటీ సాధిస్తుందని స్పష్టం చేసింది.

ఏపీలోని 25 లోక్ సభ నియోజకవర్గాల్లో 21 స్థానాలను వైసీపీ గెల్చుకుంటుంది. 45 శాతం ఓట్ షేర్ ను సొంతం చేసుకుంటుంది. టీడీపీ 37.2 శాతం ఓట్లతో కేవలం నాలుగంటే

- మిగతా 2 లో

**వీడీపీ అసోసియేట్స్ అంచనాల ప్రకారం..**

ఏపీలో ఓట్ల శాతం

| | |
|---|---|
| వైసీపీ | 45 శాతం |
| టీడీపీ | 37.2 శాతం |
| బీజేపీ | 7.13 శాతం |
| జనసేన | 5.9 శాతం |
| కాంగ్రెస్ | 2.20 శాతం |
| సీపీఎం | 0.24 శాతం |
| సీపీఐ | 0.2 శాతం |
| ఇతరులు | 2.1 శాతం |

లోక్ సభ స్థానాలు

| | |
|---|---|
| వైసీపీ | 21 |
| టీడీపీ | 4 |
| బీజేపీ | 0 |
| కాంగ్రెస్ | 0 |
| జనసేన | 0 |

# మంగళగిరి వైసీపీ అభ్యర్థి ఎవరు.?


ఆర్కే


చేనేత అభ్యర్థి అన్వేషణలో

**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్ కె మళ్లీ పోటీ చేస్తున్నారా లేదా అనే అంశంపై వైఎస్ ఆర్ సీపీ అధిష్టానం ఇంకా తర్జనభర్జన పడుతోంది. తాను రెండవ సారి కూడా రంగంలో ఉన్నానని ఆర్కే బాహాటంగా ప్రకటించిన తర్వాత కూడా ఇంకా ఆ అంశంపై చర్చ జరుగుతోంది. కారణాలు గమనిస్తే తెలుగు దేశం పార్టీ ఇక్కడ చేనేత అభ్యర్థిని లేక ఎవరైనా సీనియర్ నాయకుడిని నిలిపే ఆలోచనలో ఉందని గ్రహించిన వైయస్ఆర్ పార్టీ తాము కూడా చేనేత అభ్యర్థినే ఎంపిక చేయాలన్న ఆలోచనకు వచ్చి ఆ మేరకు వ్యూహరచన లో ఉంది. గత నాలుగున్నర సంవత్సరాలు గా ఇక్కడి చేనేత వర్గాల కు నొప్పి తగలకుండా బాలెన్స్‌గా ఆర్కే

- మిగతా 3 లో

## చంద్రబాబు నాయుడు

# మంగళగిరి నుండి పోటీ?




**రాజధాని వార్తలు, అమరావతి :** రెండు మూడు నెలల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి జరగబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీ చేయబోతున్నారా? అంటే.. అవుననే చెప్పవచ్చు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అస్మదీయులకంటే తస్మదీయులే ఎక్కువగా ఉన్నారు. జగన్ మోహన్ రెడ్డి, పవన్‌కళ్యాణ్, సిపియం, సిపిఐ, కాంగ్రెస్, బీజేపీ, మాదిగ దండోరా, బిసి జన మహాసభ, కాపునాడు వీళ్ళందరూ ప్రత్యక్షంగా చంద్రబాబును బహుముఖాలుగా వ్యతిరేస్తుంటే.. పరోక్షంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరో ప్రశ్న చంద్రబాబు వ్యతిరేకులు లోకేష్‌ను కూడా వదలడం లేదు. తెలుగుదేశం పార్టీలో పొలిట్ బ్యూరో సభ్యులు, సీనియర్ మంత్రులు, సీనియర్ నాయకులు కూడా పైకి లోకేష్‌ను తమ సహచరుడిగా అంగీకరిస్తున్నప్పటికీ లోలోన మాత్రం

- మిగతా 3 లో

బెజవాడ రైల్వేస్టేషన్‌లో

# మరో రెండు ప్లాట్‌ఫారాలు


2లో




# సామాన్యుల వేదికగా మీడియాహౌస్

## అహ్మద్ షరీఫ్





**రాజధాని వార్తలు, విజయవాడ :** మహాత్మా గాంధీ రోడ్డులోని బిగ్ సీ వెనుక నూతనంగా ప్రారంభించిన వి మీడియా హౌస్ అందరికీ అందుబాటులో ఉండి, సామాన్యులకు వేదికగా ఉండాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన మండలి చైర్మన్ అహ్మద్ షరీఫ్ కోరారు. శాసన సభ చైర్మన్‌గా పదవి చేపట్టడంతోపాటు, అదే రోజు మీడియా హౌస్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ హౌస్ ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పేదలకు అందేలా చూడాలని కోరారు. సమాజసేవతోపాటు సామాజిక ధృక్పదాన్ని మీడియా పెంపొం దించాలని, ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా మీడియా హౌస్ నిలవాలని ఆకాంక్షించారు. స్నేహా టీవీ చీఫ్ ఎడిటర్ కరీం మాట్లాడుతూ మనందరం కలసి ఈ వేదికను ద్వారా అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేర వేసే విధంగా వాడుకుందామని, ఇందులో తన వంతు పాత్ర పోషిస్తానని అన్నారు.

గౌరవ అతిథిగా వచ్చిన ముఫ్తి ఫారుక్ మాట్లాడుతూ మనం చేసే పనులు మాట్లాడే విషయాలు జాగ్రత్త గా చేయాలని మనం ఏం మాట్లాడితే అవే మనకు వర్తిస్తాయని అన్నారు. మన సమాజంలో మంచి ఉందంటే అది కేవలం మీడియా వల్ల మాత్రమే అని, ఎంత పెద్ద వారైనా బయటపడేది మీడియాకేనన్నారు. ప్రజలు సుఖంగా జీవించాలంటే మన ప్రభుత్వమే కారణమని కాబట్టి మన నాయకులను ఎన్నుకునేటప్పుడు మంచి వారిని చూసి ఎన్నుకోవాలన్నారు. దానికి నిలువెత్తు ఉదాహరణే ఛైర్మన్ షరీఫ్ అన్నారు. మీడియా ఎల్లప్పుడూ బాధితుల వైపు ఉండాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజలముందుంచి అర్హులైన వారికే ఆ ఫలాలు దక్కాలన్నారు. మీడియా అమ్ముకునే వస్తువు కాదని బాధ్యతతో వార్తలను ప్రచురిస్తే ప్రభుత్వం ఆ వార్తలను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ మహబూబ్ షేక్ మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన ఈ మీడియా హౌస్ సామాన్యులకు కూడా అందుబాటులోకి రావడం హర్షనీయమన్నారు. యం.ఎస్ ఎంటర్ ప్రైజెస్ చైర్మన్ మొహిద్దీన్ మాట్లా డుతూ నిజమైన వార్తలను ప్రజల ముందు ఉంచాలనే, నిర్భయంగా జర్నలిస్టుగా పని చేసి ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసి సమాజశేయస్సుకే పనిచేస్తున్న విలేకరులను ఆయన అభినందించారు. మీడియా హౌస్ అధినేత హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ సమాజానికి తన వంతు బాధ్యతను నెరవేర్చే క్రమంలో మీడియా హౌస్‌ను ఏర్పాటు చేశామని, సామాన్యులకు మీడియా దగ్గరవ్వాలనేదే తన లక్ష్యమన్నారు. మీడియా హౌస్ డైరెక్టర్ అపరేషన్స్ అబ్దుల్ అలీం, వైసీపీ నేత మెహబూబ్ షేక్, ఇందాద్‌ఘర్ కార్యదర్శి ఫిరోజ్, ఎలక్ట్రానిక్,ప్రింట్ మీడియా జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మీడియా హౌస్‌లో 2019 కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అహ్మద్ షరీఫ్, రాజధాని వార్తలు ఎడిటర్ హుస్సేన్ ఖాన్ తదితరులు

# రాజధాని వార్తలు కలం

## చిరుద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

నాలుగున్నరేళ్లలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ కల్పన హామీలను తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయి. బాబు వస్తేనే జాబు వస్తుందన్న నినాదంతో అధికారం చేజిక్కించుకున్న ప్రభుత్వం రాష్ట్రంలో రెండున్నర లక్షల ఉద్యోగాలను భర్తీ చేయలేదు సరికదా.. 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, కేవలం ఏడువేల ఉద్యోగాలకు మాత్రమే డీఎస్సీ నిర్వహించింది. అదీ ఎన్నికల ముందు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కూడా ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాల కల్పన అని నిరుద్యోగులకు తీవ్రంగా మోసం చేసింది. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో కాంట్రాక్టు వర్కర్ల పరిస్థితికూడా అలక్ష్యానికి గురయింది. ఎన్నికల ముందు వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామన్న ప్రభుత్వం మాటమార్చి పర్మినెంట్ చేసే ప్రసక్తే లేదని శాసనసభ సాక్షిగా ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెగేసి చెప్పడం ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక వైఖరిని ప్రతిబింబిస్తోంది. దీనికి మంత్రి సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను సాకుగా ప్రస్తావించారు. వాస్తవానికి కాంట్రాక్టు వ్యవస్థను కొనసాగించవద్దని, ఉద్యోగాలలో రెగ్యులర్ ఉద్యోగులనే నియమించాలని ఇటు హైకోర్టు అటు దేశ అత్యున్నత న్యాయస్థానం పదేపదే ప్రభుత్వాలకు మొట్టికాయలు వేస్తూ వస్తున్నా పట్టించుకోలేదు. పాలకుల ద్వంద్వ నీతికి ఇది దర్పణం పడుతోంది. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో మండలిలో ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, 180 రోజుల ప్రసూతి సెలవు మంజూరు విషయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రభుత్వ ఉత్తర్వులున్నాయని ఆయా ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. దీనికి ప్రతి స్పందనగా కాంట్రాక్టు ఉద్యోగులను ఏవరినీ తొలగించబోమని ఒకవైపు చెబుతూ మరోవైపు వారిని రెగ్యులర్ చేసే ప్రసక్తి తమకు లేనే లేదని చెప్పడం వారి రెండు నాల్కల ధోరణిని ప్రతిబింబిస్తోంది. ఒకవైపు క్రమబద్ధీకరణకు ససేమిరా అంటూనే మరోవైపు పాలిటెక్నిక్ కళాశాలలు, గురుకులాల్లో లెక్చరర్లు, విద్య, వైద్య, ఐఅండ్‌పిఆర్ తదితర విభాగాల్లో పలు పోస్టులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లోనే నియామకాలు చేపట్టడమంటే నిరుద్యోగులను దోచుకోవడమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ప్రప్రథమ ర్యాంకులు వస్తున్నది ఇందుకే. ఉపాధి భద్రతకు భరోసానిస్తున్న చట్టాలను నీరుగార్చడం సిగ్గు చేటు.రాష్ట్రంలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సిబ్బంది మూడు లక్షల మంది పైగా ఉన్నారు. అధికారంలోకి వచ్చీరాగానే వీరందరినీ రెగ్యులరైజ్ చేస్తామని తెలుగుదేశం అధినేతగా గత ఎన్నికల ముందు పాదయాత్రలో పలుచోట్ల చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోనూ వాగ్దానం చేసింది. హోంగార్డులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యా వాలంటీర్లు మొదలైన సిబ్బంది క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామన్న వాగ్దానాన్ని కూడా టిడిపి ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కార్యాచరణ రూపొందించాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆశలు రేపారు. నాలుగున్నరేళ్లలో అనేక మార్లు సమావేశమైన ఉపసంఘం క్రమబద్ధీకరణకు న్యాయస్థానాల తీర్పులు అడ్డంగా ఉన్నాయనీ, గతంలో తెలుగుదేశం ఏలుబడిలో ఉన్నప్పుడే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన 4/94 జీవో కూడా రెగ్యులరైజేషన్‌కు ఆటకం కలిగిస్తోందని కొండను తవ్వి ఎలుక పట్టిన చందంగా కేబినెట్ ఉపకమిటీ ఏమీ తేల్చకుండానే చేతులు దులిపేసుకుంది. అసెంబ్లీ చివరి సమావేశాల్లోనూ క్రమబద్ధీకరణకు నో చెప్పడం ద్వారా తాను ఉద్యోగ వ్యతిరేకినని కుండబద్ధలు కొట్టింది టీడీపీ ప్రభుత్వం. 1994లోనే సుప్రీంకోర్టు రెగ్యులర్ వేకెన్సీలలో రెగ్యులర్ నియామకాలు మాత్రమే జరపాలని చెప్పినా, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కంటింజెన్సీ..ఇలా రకరకాల చట్టవిరుద్ధ పద్ధతులకు ప్రభుత్వం పాల్లడింది. ఒకే కార్యాలయంలో రెగ్యులర్ సిబ్బంది, అటు కాంట్రాక్టు / ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఒకే తరహా విధులు నిర్వహిస్తున్నా జీతభత్యాల్లో భారీ తేడాలుంటాయి. వీరంతా వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఎంతవరకు ప్రభావితం చేస్తారో వేచి చూడాల్సిందే.



" గెలుపు గురించి అతిగా ఆలోచించొద్దు, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకో చాలు "

- అబ్రహాం లింకన్

### బెజవాడ రైల్వేస్టేషన్‌లో

## మరో రెండు ప్లాట్‌ఫారాలు

- 20 అడుగుల సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- గాంధీకొండ వద్ద స్టెర్‌వే, పార్కింగ్




**రాజధాని వార్తలు, అమరావతి** : దక్షిణ భారతదేశంలో రద్దీగా ఉండే విజయవాడ రైల్వే స్టేషన్‌కు మరో రెండు ప్లాట్ ఫారంలు ఏర్పాటు అయ్యాయి.అంతకు ముందు 10 ప్లాట్‌ఫారంలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు సమానంగా ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 12కు పెరిగింది. అత్యంత రద్దీగా ఉండే ముంబైలోని ఛత్రపతి శివాజీ రైల్వే స్టేషన్‌కు 18 ప్లాట్ ఫారాలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 250పైగా ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు 150 సరుకు రవాణా రైళ్లు ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.రోజుకు లక్ష నుంచి లక్షన్నర మంది ప్రయాణీకుల ఈ స్టేషన్ నుంచి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. సెలవులు, పండగ రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ఈ స్టేషన్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణీకులను దృష్టిలో పెట్టుకుని ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నుంచి 7వ నెంబరు ప్లాట్‌ఫారం వరకూ ఉండే పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి, దాని స్థానంలో 20 అడుగుల వెడల్పుతో సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ఫుట్ బ్రిడ్జి 10వ ప్లాట్‌ఫారంతో ముగియకుంగా పశ్చిమవైపు ఉన్న నెహ్రూ రోడ్ మీదుగా గాంధీకొండ సమీపంలోని నక్షత్రశాల వద్ద దిగే విధంగా డిజైన్ చేశారు. దీంతో వన్‌టౌన్ వైపు వెళ్లవలసిన ప్రయాణీకులు రోడ్డు దాటే అవసరం లేకుండా నేరుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చని అధికారులు తెలిపారు. తూర్పు వైపు ప్రధాన స్టేషన్ భవనం, రెండో స్టేషన్ భవనాలకు సంబంధించి వెలుపల ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో ఆర్టీసీ సిటీ సర్వీసులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండడంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు : ధనుంజయులు**

ప్రయాణీకుల మౌలిక సదుపాయాల కోసం ఈ ఏడాది రూ.25 నుంచి 30 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) ఆర్.ధనుంజయులు తెలిపారు.ముఖ్యంగా తూర్పు వైపు సర్క్యులేటింగ్ ఏరియా పునరాభివృద్ధి పనుల ద్వారా ట్రాఫిక్ సమస్యలకు చెక్ చెబుతామన్నారు. స్టేషన్ వెలుపలికి వచ్చిన ప్రయాణీకులు బస్టాపు, పార్కింగ్ వద్దకు చేరుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేని విధంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు.

# ఆరోగ్య ప్రదాత ఆదిత్యుడు





**మాఘ శుద్ధ సప్తమి రోజు హిందువులు రథసప్తమి పండుగ జరుపుకుంటారు. సూర్య భగవానుడు, సూర్య గ్రహము వేరు. ఈ రెండింటినీ అన్వయించి పూజించడం మన పూర్వీకులు నాగరికతను తెలియజేస్తుంది. సూర్య గోళము మండుతున్న అగ్ని గోళము సూర్య భగవానుడు కశ్యపుమహాముని కుమారుడు, తేజోవంతుడు,భార్యా బిడ్డలు ఉన్న దేవతామూర్తి. లోకసాక్షి అయిన ఆసూర్యభగవానుని అర్చించి ఆయన కరుణా కటాక్షాలను పొందే సుదినమే మాఘ శుద్ధ సప్తమి అదే ఆయన జన్మతిథి రథసప్తమి.**

సూర్యుడు జన్మించిన ఈ మాఘమాసం లో రథసప్తమినాడు సూర్యుడిని పూజించే అవకాశం లేనివారు ఏదో ఓ ఆదివారం నాడు పూజించినా సత్ఫలితం ఉంటుందని పెద్దలంటారు.రథసప్తమి నాడు సూర్యోదయానికి పూర్వమే స్నానాదికాలు చేసి, సూర్యోదయానంతరం దానాలు చేయాలి. ఈరోజు సూర్య భగవానుని యెదుట ముగ్గు వేసి ,ఆవుపిడలపై ఆవుపాలతో పొంగలి చేసి ,చిక్కుడు ఆకులపై ఆ పోంగలిని ఉంచి ఆయనకు నివేదన ఇవ్వాలి.

సూర్యుని గమనం ఏడు గుర్రముల బంగారు రథం మీద సాగుతుందని వేదము "హిరణ్యయేన సవితారథేన" తెలుపుతుంది. సూర్య గమనం ప్రకారం ఉత్తరాయణము, దక్షిణాయణములుగా ఉంటుంది. ఆషాఢమాసము నుండి పుష్యమాసము వరకు దక్షిణాయనము. సూర్యరథం దక్షిణాయనంలో దక్షిణ దిశగా పయనిస్తుంది. తరువాత సూర్యుడు మకరరాశి ప్రవేశం ఉత్తరాయన ప్రారంభ సూచకము రథసప్తమి అని పేరు వచ్చింది.

మాఘ శుద్ధ సప్తమి సూర్య గ్రహణముతో సమానము. ఆరోజు అరుణోదయవేళ స్నాన, జప, అర్ఘ్యప్రదాన, తర్పణ, దానాదులన్ని అనేక కోట్ల పుణ్యఫలములను ఆయురారోగ్య సంపదలనిచ్చును. సప్తమినాడు షష్టి తిథి గూడయున్నచో షష్టీ సప్తమీ తిథుల యోగమునకు పద్మమని పేరు. ఈయోగము సూర్యుని కత్యంత ప్రీతికరము. ఆ సమయమున ఏడు జిల్లేడు ఆకులను ధరించి నదీస్నానము చేసినచో ఏడు జన్మములలో చేసిన పాపములు నశిస్తాయని గర్గమహాముని ప్రబోధము. రథసప్తమినాడు బంగారము/, వెండి/, రాగి/రథమును చేయించి, కుంకుమాదులు, దీపములతో నలంకరించి అందులో ఎర్రని రంగుగల సూర్యుని ప్రతిమ నుంచి, పూజించి, గురువునకు ఆ రథమును దానమీయవలెనని, ఆ రోజు ఉపవాసముండి, సూర్యసంబంధమగు రథోత్సవాది కార్యక్రమములతో గడపాలి. రథసప్తమీ వ్రతముతో సూర్యభగవానుని అనుగ్రహముచే ఆయురారోగ్యాది సకల సంపదలు సంభవిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

రథసప్తమి రోజున అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించి, సేవించడం ద్వారా రోగ, శోక, దారిద్ర్యాలు పోతాయని భక్తుల నమ్మకం. అందుకే రథసప్తమి రోజున భక్తులు స్వామివారి నిజరూప దర్శనం, మహాక్షీరాభిషేకం సేవలో పాల్గొని తరిస్తారు. ఆదిత్యాలయంలో రథసప్తమి రోజున శ్రీసూర్యనారాయణస్వామి నిజరూప దర్శనం భక్తులకు మరపురాని మధురానిభూతి కలిగిస్తుంది. మూలవిరాట్ కింద వైజయంతి సప్త అశ్వరథం ఉంటుంది. రథంపై గుర్రాలు తాళ్లు పట్టుకుని సూర్య రథసారథి అనూరుడు ఉంటారు. స్వామి పాదాల ముందర ఛాయాదేవి, స్వామి ఎడమవైపు, కుడివైపు ఉషా, పద్మినిదేవి ఉంటారు. ముగ్గురు దేవేరుల్లో ఉషా, పద్మిని ధనుస్సులు ధరించి ఉంటారు. స్వామికి ఎడమవైపున ద్వారపాలకుడైన మాఠరుడు కత్తి, డాలు ధరించి ఉంటాడు. స్వామికి కుడివైపున చిన్న గడ్డంతో కూడిన పింగళుడు ఎడమవైపు సిరాబుడ్డీ, కుడిచేతిలో కలం పట్టుకుని ఉంటాడు. ఈయనే భక్తులు చేసే విజ్ఞాపనలు, కోరికలు స్వీకరించి స్వామికి నివేదిస్తారు. స్వామికి శిరస్సుకు ఎడమవైపు సనకుడు ఛత్రంలోను, కుడివైపున సనందుడు అనే మహర్షి ఛామరం పట్టుకుని సేవలు అందిస్తారు. స్వామికి రెండు చేతులు అభయ ముద్రలలో ఉంటాయి. స్వామి భుజాలకు ఇరువైపుల తామరపూలు, మొగ్గలను ధరించి ఉంటారు. స్వామి నిజరూప దర్శనంలో వస్త్రాల కిందన బెల్టును ధరించి ఉంటారు. సూర్యనారాయణస్వామి మెడలో హారాలు, మకర కుండలాలు, కేయూరాలు, రత్నఖచిత సూర్యమణి కిరీటంతో చిరునవ్వుతో స్థానక భంగిమలో భక్తులకు స్వామి దర్శనం ఇస్తుంటారు. స్వామి శిరస్సు మీద శరభ సాల్వం అనే పతాక చిహ్నం ఉంటుంది.

**పాయసాన్నం.. పరమౌషధం**

రథసప్తమి రోజున ఉదయం 8 గంటల లోపు వాకిట్లో పొయ్యిను పెట్టి కొత్తబెల్లం, కొత్తబియ్యం, చెరకు, ఆవుపాలతో పాయాసన్నం చేసి స్వామికి నివేదించి భక్తులు తింటే నరాలు, కీళ్ల నొప్పులు, హృద్రోగ సంబంధ వ్యాధులు నశిస్తాయని నమ్మకం. స్వామికి సమర్పించిన తీపి పదార్థంపై లేలేత సూర్యకిరణాలు పడడం వల్ల శరీరంలో రోగ నిరోధకశక్తి పెరిగి, మధుమేహవ్యాధిని తగ్గిస్తుంది. పాయాసన్నంలో వాడే చెరకు వల్ల పళ్లు, దవడలు, నరాలకు శక్తి వస్తుంది. రోగనివారణ కలుగుతుందని భక్తులు నమ్ముతారు.

# ఓట్ల కోసం వల



**న్యూఢిల్లీ :** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ అధికార పీఠమెక్కడమే లక్ష్యంగా ఇటీవల ఎన్డీయే ప్రభుత్వం జనరంజక బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. పేరుకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్టే అయినా కీలక ప్రతిపాదనలు చేసింది. రైతులకు నేరుగా నగదు సహాయం చేసేందుకుగాను ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం-కిసాన్)ని ప్రవేశపెట్టింది. పీఎం కిసాన్ కింద దేశవ్యాప్తంగా 12.5 కోట్ల మంది చిన్న సన్నకారు రైతులకు ఏటా రూ.6000 ఆర్థిక సహాయం అందనుంది. 2 హెక్టార్లు లేదా అంతకంటే తక్కువ భూమి ఉన్న రైతు కుటుంబాలు ఈ సహాయం పొందేందుకు అర్హులని వెల్లడించింది. రూ.6 వేలను మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది.

**మార్గదర్శకాలు**

తాజాగా ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. వీటి ప్రకారం.. మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో సహాయం పొందేందుకు అనర్హులు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంపీలు రాజ్యాంగబద్ధ హోదాల్లో ఉన్నవారు పన్ను చెల్లింపుదారులు విశ్రాంత-సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు నెలకు రూ.10 వేల కంటే ఎక్కువ పింఛను తీసుకుంటున్నవారు కూడా అనర్హులే. వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు చార్టర్డ్ అకౌంటెంట్లు వంటి వృత్తిదార్లు, ప్రొఫెషనల్ సంఘాల్లో నమోదు చేసుకున్న ఆర్కిటెక్టులకు పీఎం కిసాన్ సమ్మాన్ సహాయ నిధి అందదు. మున్సిపల్ కార్పొరేషన్ల మాజీ-ప్రస్తుత మేయర్లు జిల్లా పంచాయతీల మాజీ-ప్రస్తుత ఛైర్ పర్సన్లు కూడా అనర్హులే. ప్రభుత్వ ఉద్యోగుల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ క్లాస్-4 గ్రూప్-డి ఉద్యోగులు మాత్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి సహాయం పొందగలరు. రాష్ట్ర కేంద్ర పాలిత ప్రాంతాల రికార్డుల ప్రకారం భర్త భార్య వారి మైనరు పిల్లలకు కలిపి 2 హెక్టార్లు లేదా అంతకంటే తక్కువ భూమి ఉన్న కుటుంబాలను చిన్న సన్నకారు రైతు కుటుంబంగా తాజా మార్గదర్శకాల్లో ప్రభుత్వం నిర్వచించింది. తప్పుడు ధ్రువపత్రాలతో సహాయం పొందినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. కిసాన్ సమ్మాన్ పథకం సాయం తొలి విడతగా మార్చి మొదటి వారంలో ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.2 వేలు జమ చేసే అవకాశముంది.

## వైసీపీదే హవా !

(మొదటిపేజీ తరువాయి)


నాలుగు సీట్లకు పరిమితమవుతుంది.

జనసేన వచ్చే ఎన్నికలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని సర్వే అంచనా వేసింది. 5.9 శాతం ఓట్లను పవన్ కల్యాణ్ పార్టీ సాధిస్తుందని.. అయితే ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెల్చుకోలేదని స్పష్టం చేసింది. టీడీపీ-జనసేన మధ్య కాపు ఓట్ల చీలిక జరుగుతుందని.. తద్వారా వైసీపీ లాభపడుతుందని అంచనా వేసింది. ఇక కాంగ్రెస్ 2.2 శాతం ఓట్లు సాధిస్తుందని.. దాని కంటే మెరుగ్గా బీజేపీ 7.13 శాతం ఓట్లను ఖాతాలో వేసుకుంటుందని వెల్లడించింది. లోక్ సభ ఎన్నికల సరళే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగితే టీడీపీ కేవలం 30 సీట్లకు పరిమితమవుతుందని సర్వే అభిప్రాయపడింది. వైసీపీకి 130కి పైగా సీట్లు వస్తాయని అంచనా వేసింది. గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కర్ణాటక తమిళనాడు ఎన్నికల ఫలితాలను వీడీపీ అసోసియేట్స్ పక్కాగా అంచనా వేసిన సంగతి గమనార్హం.

## నిరసనలు వెల్లువెత్తాలి :చంద్రబాబు

**హైదరాబాద్ :** విభజన గాయాలపై కారం జల్లి ప్రధాని మోడీ పైశాచిక ఆనందం పొందుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎక్కడికక్కడ ఆయన నోరు పారేసుకుంటున్నారని, రేపు గుంటూరు వచ్చి అదే దురుసుతనం ప్రదర్శిస్తారని సీఎం దుయ్యబట్టారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన వ్యక్తి ఏపీకి వచ్చారని దేశమంతా తెలిసేలా నిరసనలు తెలపాలని పార్టీ కేడర్‌కు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు పార్టీ నేతలతో శనివారం ఉదయం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతా పసుపు చొక్కాలు ధరించి ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని దిశానిర్ధేశం చేశారు. గాంధీజీ స్ఫూర్తితో ఆది, సోమవారాలను చీకటి దినంగా భావించి కసి పట్టుదలతో అందరూ నిరసనలు తెలపాలని సూచించారు. సోమవారం ధర్మపోరాట దీక్షకు మద్దతుగా స్థానికంగా ఎవరికి తోచిన విధంగా వాళ్లు నిరసనలు తెలపాలన్నారు. చేసిన దుర్మార్గం చూసేందుకు మోడీ వస్తున్నారని, రాష్ట్రంలో మరో వ్యక్తి ఆయనకు సహకరిస్తున్నాడని చంద్రబాబు ఆక్షేపించారు. రాష్ట్రాల్ని అస్థిర పరిచేందుకు కుట్ర పన్నుతున్నారని, ఇందుకు మానసికంగా అన్నిటికీ సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. మొన్న పశ్చిమ బెంగాల్‌లో చేశారు.. రేపు ఇక్కడా చేస్తారని.. దేనికీ బెదిరేది లేదని తేల్చి చెప్పారు.మోడీ ద్రోహంపై జగన్ ఒక్కమాట అనరని విమర్శించారు. బీజేపీ, వైసీపీ కుమ్మక్కుకు అదే రుజువన్నారు. రాఫేల్ బురదలో మోడీ కూరుకుపోయారని, దొంగే దొంగా అన్నట్లుగా ప్రధాని వ్యవహారశైలి ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాఫేల్ వ్యవహారంలో పీఎంవో జోక్యం దేశానికే అప్రతిష్ట అని మండిపడ్డారు. మోడీ అడుగులు ఆంధ్రప్రదేశ్‌ను అపవిత్రం చేస్తాయని దుయ్యబట్టారు.

# సమావేశాలు నిరవధిక వాయిదా



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ 13వ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినట్లు శాసనసభలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మండలిలో డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం ప్రకటించారు. శాసనసభ సమావేశాలు ఆరు రోజుల్లో 38 గంటల 12 నిమిషాలు జరిగాయి. 20 బిల్లులు ప్రవేశపెట్టగా అన్నీ ఆమోదం పొందాయి. మొత్తం 70 మంది సభ్యులు మాట్లాడారు. రెండు తీర్మానాలు ప్రవేశపెట్టి, ఐదు అంశాలపై లఘు చర్చ నిర్వహించారు. ఐదు నివేదికలను సభముందుంచారు. శాసన మండలి సమావేశాలు ఆరు రోజుల్లో 23 గంటల 4 నిమిషాలు జరిగాయి. 20 బిల్లులు ప్రవేశపెట్టగా అన్నీ ఆమోదం పొందాయి. ఐదు నివేదికలను మండలి ముందుంచారు. ఒక తీర్మానాన్ని, ఒక వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

**నాలుగున్నరేళ్లలో 127 రోజులు**

శాసనసభ సమావేశాలు 2014 నుంచి 2019 వరకూ మొత్తం 127 గంటలు జరిగాయి. 630 గంటల 42 నిమిషాలు సభ నడిచింది. టీడీపీ సభ్యులు 497 గంటలు, వైసీపీ సభ్యులు 92 గంటల 50 నిమిషాలు, బీజేపీ సభ్యులు 35 గంటల 38 నిమిషాలు, నవోదయం పార్టీ సభ్యులు 28 నిమిషాలు, ఇండిపెండింట్ సభ్యులు, నామినేటెడ్ సభ్యులు 04 గంటల 24 నిమిషాలు మాట్లాడారు. ముఖ్యమంత్రి 81 గంటల 04 నిమిషాలు, ప్రతిపక్షనేత 26 గంటల 38 నిమిషాలు ప్రసంగించారు. 133 బిల్లులను సభ ఆమోదించింది. 30 లఘు చర్చలు నిర్వహించారు. 21 తీర్మానాలను ప్రవేశపెట్టారు. 45 వాయిదా తీర్మానాలు అందాయి. 214 నివేదికలను ప్రవేశపెట్టారు. 25 ఆర్డినెన్సులను సభముందుంచారు.

# కబ్జాకోరల్లో మంగళగిరి



**రాజధాని వార్తలు, అమరావతి :** రాజధాని ప్రాంతంగా గుంటూరు, కృష్ణాజిల్లా మధ్య ఉన్న అమరావతిని ప్రకటించడంతో అక్కడి భూములకు రెక్కలు వచ్చాయి.రాజధానికి ముఖద్వారం అయిన మంగళగిరి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం, ఇప్పుడు భూకబ్జా కోరల్లో చిక్కుకుంది. ఎక్కడ చూసినా భూకబ్జాలు భూ కుంభకోణాలతో అక్రమంగా కోట్లు దుండుకోవడం భూ బకాసూరులకి పరిపాటిగా మారింది. అధికార పార్టీ నాయకుల అండదండ ఉండి ఖాళీగా స్థలం కనిపిస్తే చాలు కబ్జాచేయడం మామూలు అయింది. మున్సిపల్ బావులను పూడ్చి మరీ కబ్జా చేయటం, చివరకు మనిషి చనిపోతే పూడ్చి పెట్టే స్మశాన స్థలాలను సైతం వదలకుండా కబ్జాచేసేసి గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసుకొని కట్టడాలు చేస్తున్నారు. తాజాగా మంగళగిరి ప్రాంతం మున్సిపల్ పరిధిలోని ద్వారకా నగర్

**పట్టించుకోని అధికారులు**

నుండి ఏపీఎస్పీ క్యాంప్ వైపు వెళ్లే మార్గంలో ఉండే హిందూ స్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. అదే తరహాలో తెనాలి రోడ్డు వద్ద ఉన్న సర్వే నెం.220లో ఉన్న క్రైస్తవ సమాధులకు సంబందించిన 9 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో చేతులు తడిపి నకిలీ రిజిస్టర్ చేయించి రాత్రికి రాత్రి స్థలాన్ని చదును చేసి, కొందరు వ్యక్తులు భూమిని మింగేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా క్రైస్తవ పెద్దలు కబ్జాదారులను ప్రశ్నించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.స్మశాన స్థలాల్లో కొత్తగా పుట్టుకొచ్చిన దొంగ యాజమానులను ప్రజలు ఇదేంటని ప్రశ్నిస్తే మేము దళితులం ఇది మాస్థలం మీకేంటని దౌర్జన్యంగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. రాజధాని ప్రాంతంలో కోట్లు విలువ చేసే స్థలాలు కబ్జాకోరల్లో చిక్కుకున్నా.. మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తూ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తూ కబ్జా స్థలాలకు పాత తేదీలతో పన్నులు వేస్తున్నట్లు తెలుస్తుంది.దీనికి కారణం కబ్జా దారుల వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలు మెండుగా ఉన్నట్లు సమాచారం. అందులోనూ ఎన్నికలు సమీపించే వేళ చేతిలో అధికారంతో దొరికినంత దోచుకుదాం అనే సిద్ధాంతంతో ఉన్నారని పిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అన్యాక్రాంతం అవుతున్న భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# అరుణిమా సిన్హాకు అభినందనలు







**ప్రయాణిస్తున్న రైలు నుంచి దుండగుల ఆమెను తోసివేశారు. ఏడుగంటలపాటు అలాగే పడి ఉన్నారు. తర్వాత ఎవరో ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. ఈ దుశ్చర్య ఆమెను అంగవైకల్యానికి గురిచేసింది. అక్కడితో ఆమె కష్టాలు ఆగిపోలేదు. టికెట్ లేకుండా ప్రయాణించిందని, ఆత్మహత్యకు ప్రయత్నించిందని నానా మాటలు అన్నారు. అయినా ఆమె ఆత్మస్థైర్యం సడలలేదు. ప్రపంచంలోని ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించిన తొలి వికలాంగురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విజయగాథ..**

ఆమె

ప్రపంచంలోని ఏడు అతిపెద్ద పర్వత శిఖరాలను అధిరోహించిన ఆమె ఈ మధ్యే అంటార్కిటికాలోని అతిపెద్ద మంచు పర్వత శిఖరమైన విన్సన్ మాసిఫ్ పైకి విజయవంతంగా చేరుకొని భారత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.పట్టుదల ముందు వైకల్యం అడ్డురాదని నిరూపించిన అరుణిమకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం భారత్‌కు ఎంతో గర్వకారణమని కొనియాడారు.ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశానికి చేరుకున్నందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని అరుణిమ చెప్పారు.ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం అంటే మామూలు విషయం కాదు. కానీ, ప్రపంచంలో ఇంతటి ఘనత సాధించిన తొలి వికలాంగురాలు అరుణిమా సిన్హానే.

పర్వతారోహణను పురుషుల క్రీడగా చాలామంది భావిస్తారు. అందుకే, మహిళలు ఇందులోకి రావాలనుకుంటే ఎవరూ ప్రోత్సహించరు. పైగా వికలాంగురాలైతే మరీ కష్టం. ప్రజల్లో ఉండే ఈ మనస్తత్వానికి ఆమె అడ్డుకట్ట వేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌లో పుట్టి పెరిగిన అరుణిమ.. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2011లో జరిగిన ఒక దుస్సంఘటనలో నన్ను నడుస్తున్న రైలులోంచి కొందరు వ్యక్తులు బయటకు తోసేశారు.ఏడు గంటలపాటు రైలు పట్టాల మీదే పడి ఉంది. ఆ తర్వాత ఎవరో ఆమెను ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. అసలు పోరాటం.. 'నేను ఎయిమ్స్‌లో ఉన్న సమయంలోనే మొదలైంది. నేను ఆత్మహత్య చేసుకునేందుకే రైలులోంచి దూకాననీ, నా వద్ద టికెట్ లేదనీ.. ఇలా నా గురించి రకరకాల పుకార్లు వ్యాపింపజేశారు. మహిళగా నా పట్ల సానుభూతి చూపడానికి బదులు నన్ను వివాదంలోకి లాగడంతో చాలా బాధపడ్డా' అని అరుణిమ గుర్తు చేసుకున్నారు.అయినప్పటికీ ఆమె ఆత్మస్థైర్యం కోల్పోలేదు. దేశవ్యాప్తంగా ఎందరికో ప్రేరణగా నిలిచారు.గతేడాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని తాజుపూర్ గ్రామానికి చెందిన అబ్బాయితో అరుణిమకు వివాహమైంది. ఆమె వల్ల ఆ గ్రామానికి కూడా ఇప్పుడు గుర్తింపు వచ్చింది.అరుణిమ తామందరికీ ప్రేరణగా నిలిచిందని గ్రామస్థులు కొనియాడుతున్నారు."పెళ్లి కానుకలుగా మా ఆయనను పర్వతారోహణకు కావాల్సిన రకరకాల వస్తువులు ఇవ్వాలని కోరాను. నా విజయం వెనుక ఆయన పాత్ర ఎంతో ఉంది" అని చెప్పారు. వైకల్యం శరీరానికే తప్ప మనసుకు కాదని ఆమె నిరూపించారు.





## కాలమ్

వికలాంగులకు బ్యాటరీ సాయంతో నడుపబడు మూడు చక్రముల వాహనాలను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుంది. మీ నియోజకవర్గంలో అర్హులు ఎవరైనా ఉంటె ఈ పథకమునకు దరకాస్తు చేసుకొనుటకు వెబ్ సైట్ www.apdascac.ap.gov.in ద్వార దరకాస్తుచేసుకోవచ్చు ...
శ్రీ గోనుగుంట్ల కోటేశ్వరరావు
,చైర్మన్ (9348750999 / 9392753999).



## శ్రీ కృష్ణ రాజేంద్రప్రసాద్ హఠాన్మరణం



**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వింజమూరు శ్రీ కృష్ణ రాజేంద్రప్రసాద్ ఈరోజు ఉదయం హార్ట్ ఎటాక్ తో మృతి చెందారు నాలుగుసార్లు మున్సిపల్ కౌన్సిలర్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు కొప్పురావు కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు ఆయన పదవీ కాలంలో పలు సిమెంటు రోడ్లు నీటి సమస్య పరిష్కారం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు వింజమూరి వెంకట రత్నం రెండవ కుమారుడైన శ్రీకృష్ణ రాజేంద్రప్రసాద్ వయసు 65 సంవత్సరాలు ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

## మంగళగిరి వైసీపీ అభ్యర్థి ఎవరు.?

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించారు.అలాగని తక్కిన వర్గాలకు ఆశించిన స్థాయిలో సన్నిహితం కాలేక పోయారు. స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోక పోవడంతో అది మైనస్ గా మారింది. దీనికి తోడు నియోజకవర్గ పరిధిలో ఆర్కే కి వ్యతిరేకంగా గ్రూపులు ఏర్పడ్డాయి. ఆ మేరకు జగన్ పై వత్తిడి తెచ్చి రాజకీయాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ చేనేత వర్గ అభ్యర్థినే నిలబెట్టాలనే ఆలోచనకు బలం పెరిగింది. ఈ నెల 14 వ తేదీన తాడేపల్లి పట్టణంలో జగన్ గృహ ప్రవేశం ఉంది. ఆరోజు మంగళగిరి అభ్యర్థి పేరు ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. స్థానిక వ్యాపార ప్రముఖులు దామర్ల కుబేర స్వామి, చిల్లపల్లి మోహన్ రావు లతో పాటు మంగళగిరి సిట్టింగ్ టిడిపి కౌన్సిలర్ పేరు కూడా వినపడుతుంది. తాజాగా గుంటూరు కు చెందిన రాజకీయ వ్యాపార ప్రముఖుడు తాడిశెట్టి మురళి సతీమణి పేరు వెలుగులోకి వచ్చింది. ఈమె చేనేత ప్రముఖని కుమార్తె కావడంతో చర్చలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంది.

# మంగళగిరికి మణిహారం!

- ఏపీఐఐసీ టవర్స్-1 సిద్ధం
- 2.26 ఎకరాల విస్తీర్ణంలో రూ.110 కోట్ల వ్యయంతో నిర్మాణం
- బహుళ అంతస్తులతో సర్వాంగసుందరంగా నిర్మాణం
- పలు ప్రత్యేక మేళవింపుతో సిద్ధమైన భవనం
- పారిశ్రామిక, పెట్టుబడుల విభాగాల కార్యాలయాలన్నీ ఒకే భవనంలో ఏర్పాటు
- పెట్టుబడులు పెట్టేవారికి సత్వరం సమాచారం అందే సదుపాయం
- శుక్రవారం భవనాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**రాజధాని వార్తలు, మంగళగిరి :** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరి అభివృద్ధి సోపానంలో మరో మణిహారం చేరింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) మంగళగిరిలో ఏపీఐఐసీ టవర్స్ బహుళ అంతస్తుల భవనాల్లో టవర్-1 ప్రారంభమైంది. అత్యంత ఎత్తైన బహుళ అంతస్తులు కలిగిన ఈ టవర్స్ మంగళగిరికే తలమానికంగా నిలుస్తోంది. 2.26 ఎకరాల విస్తీర్ణంలో రూ.110 కోట్ల వ్యయంతో 11 అంతస్తుల సర్వాంగ సుందరమైన భవనాన్ని అనేక ప్రత్యేకతల మేళవింపుతో ఏపీఐఐసీ ఈ టవర్స్‌ను అత్యంత వేగంగా నిర్మాణం పూర్తి చేసింది.

**పారిశ్రామిక విభాగాలన్నీ ఒకే చోట**

మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్-1 భవనం నిర్మాణం పూర్తి కావడంతో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగాలకు సంబంధించిన కార్యాలయాలన్నీ ఒకే గొడుకు కిందకు రానున్నాయి. ఇప్పటిరకు ఈ విభాగాల కార్యాలయాలకు సొంత భవనాలు లేక విజయవాడలో పలు ప్రాంతాల్లో ఉండేవి. ఇప్పుడు ఏపీఐఐసీ టవర్స్ - భవనం పూర్తి కావడంతో ఇవన్నీ ఈ భవనంలోకి మారనున్నాయి. దీనివల్ల పరిశ్రమలకు సంబంధించి, పెట్టుబడులకు సంబంధించి అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండటంతో ప్రజలకు ఎంతో సౌలభ్యం కలగనుంది.పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చేవారికి సర్వే సమస్త సమాచారం ఈ కార్యాలయంలో లభించేలా కూడా ఏర్పాట్లు చేశారు. ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ), ఏపీఐడీసీ మరియు ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ కార్యాలయాలు కూడా ఇందులో కొలువుదీరనున్నాయి. దీంతో పాటు ఈ భవనంలో ఐటీ ఎగ్జిబిషన్ కేంద్రాన్ని కూడా ప్రధాన ఆకర్షణగా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చేవారి కోసం సర్వే సమస్త సమాచారం క్షణాల్లో లభించేలా ఒక అంతస్తు మొత్తం దీనికే కేటాయించారు. ఈ అంతస్తులోకి అడుగు పెట్టగానే రాష్ట్రంలో పెట్టబడులు పెట్టడానికి ఎలాంటి అనుకూల వాతావరణం ఉంది, పెట్టబడుల ప్రగతి ఎలా ఉంది తదితర అనేక అంశాలు సందర్శకులకు తెలిసేలా అత్యాధునిక సాంకేతికతల మేళవింపుతో ఏర్పాటు చేశారు. ఈ 11 అంతస్థుల భవంతిలో ప్రతి అంతస్తులోనూ ప్రత్యేకతలు మేళవించేలా నిర్మాణం చేపట్టారు.

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం**

ఏపీఐఐసీ మంగళగిరిలో నూతనంగా నిర్మించిన ఏపీఐఐసీ టవర్స్-1 భవంతిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ మరియు పంచాయతీరాజ్ శాఖామాత్యులు నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ఏపీఐఐసీ ఛైర్మన్ పి. కృష్ణయ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, ఐఏఎస్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ బాబు.ఏ, ఐఏఎస్, తదితరులు పాల్గొంటారు.

## గవర్నర్‌కు వైఎస్ జగన్ ఫిర్యాదు



**హైదరాబాద్ :** ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా ఓట్ల తొలగింపు, అవకతవకలపై ఆయన గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే పోలీస్ అధికారుల నియామకాల్లోనూ అధికార దుర్వినియోగంపై వైఎస్ జగన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనతోపాటు వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గవర్నర్‌ను కలిసినవారిలో ఉన్నారు.కాగా ఎన్నికలు సజావుగా జరగాలంటే డీజీపీ ఠాకుర్, ఇంటెలిజెన్స్ ఐజీ వెంకటేశ్వరరావు, డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావును వెంటనే బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) సునీల్ అరోరాను ఢిల్లీలో వైఎస్ జగన్ కోరిన విషయం తెలిసిందే.

## చంద్రబాబు నాయుడు మంగళగిరి నుండి పోటీ!

(మొదటిపేజీ తరువాయి)

వాళ్ళ లోకేష్‌ను లైట్‌గా తీసుకుంటున్నారు. గండ భేరుడాల్లాంటి తెలుగుదేశం సీనియర్ నాయకులు, మంత్రులు.. ఒక్క మాటలో చెప్పాలంటే "శివుడి మెడలో పాము" లానే లోకేష్‌ను పరిగణిస్తున్నారు. శివుడి మెడలో ఉన్న పామును ఏ గండ భేమండం ఎప్పుడూ ఏమీ చేయలేదు. ఆ పాము శివుడి మెడలో నుండి క్రిందకు దిగిందా దాని పని అంతే! ఇప్పుడు చంద్రబాబు ముందు ఉన్న సమస్యలు తనను తాను కాపాడుకుంటూ, తండ్రిలా లోకేష్ నూ కాపాడాలి. ఎలా...? ప్రత్యక్ష ఎన్నికల్లో లోకేష్ గెలవలేడనే భయంతో శాసనమండలి సభ్యుడిగా దొడ్డిదారిన అసెంబ్లీకి తీసుకువచ్చారనే విమర్శను చంద్రబాబు మోస్తున్నారు. లోకేష్‌కు ఇచ్చిన మంత్రి పదవి అలా వచ్చిందే అని విమర్శకులంటుంటారు.ఈ విమర్శనల అనుకూల శత్రువుల నోళ్ళు మూయించాలంటే ఒక్కటే మార్గం. అది రాజమార్గాన లోకేష్‌ను అసెంబ్లీకి తీసుకురావడం. అది ఎలా! చంద్రబాబునాయుడు కొత్తలో చంద్రగిరి నుండి పోటీ చేసినా ఆ తర్వాత కుప్పం నియోజకవర్గం నుండి పోటీ చేస్తూ మంచి మెజారిటీతో గెలుస్తూ వస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు ఎదురులేని మనిషి. కుప్పం ఆయనకు భద్ర నియోజక వర్గం చంద్రబాబు అసెంబ్లీ ఎన్నికలకు కుప్పం నియోజక వర్గంలో స్వయనా నామినేషన్ వేయడంగానీ, ప్రచారం చేయడంగానీ ఎప్పుడూ చేయారు. ఆయన తరపున బి. ఫారంను తెలుగుదేశం నాయకులే సమర్పిస్తారు. అక్కడి ప్రజలు ఆయనకు ప్రచార శ్రమను కూడా ఇవ్వకుండా గెలిపించుకొస్తున్నారు ఇప్పటి వరకూ . మరి ఇప్పుడు వారసుడొచ్చాడు. ఈ సారి కుప్పం నియోజకవర్గం నుండి లోకేష్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించే బాధ్యత ముందు చంద్రబాబుకు తర్వాత కుప్పం నియోజకవ వర్గ ఓటర్ల కూడా ఉంది. కుప్పం తనకు ఎంతో అచ్చివచ్చిన నియోజకవర్గం, ఎప్పుడూ తాను అక్కడ ఓటమి చవిచూడలేదు కాబట్టి ఈ సారి చంద్రబాబు తన తనయుడు లోకేష్‌ను కుప్పం నియోజకవర్గం నుండి పోటీ చేయించి గెలిపించి తీరతారు. అలా చేయడం తనకూ, లోకేష్‌కూ అని వార్యం. ఇక చంద్రబాబు సంగతి. మంగళగిరి అంధ్రప్రదేశ్ సచివాలయం వెలగపూడికి 13 కిలో మీటర్ల దూరంలో ఉంది. ప్రతిష్టాత్మక ఎయిమ్స్ నిర్మాణంలో ఉంది. చాలా భవిష్యత్తు ఉన్న పట్టణం మంగళగిరి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రిగా లోకేష్ మంగళగిరి పట్టణ అభివృద్ధికి ఇప్పటికే చేయవలసిందంతా చాలా చేశారు. ప్రస్తుతం వైఎస్సార్సీపీ నుండి గెలిచిన రామకృష్ణా రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నా మంగళగిరి నియోజకవర్గం తెలుగు దేశానికి కంచుకోట లాంటిది. దిగ్గజనాయకులు కీ.శే.ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు మంత్రిగా పనిచేసి తెలుగుదేశం పార్టీకి పునాది చాలా బలంగా వేశారు. మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాంద్రుకమల, కొంచెంలో ఎమ్మెల్యే అవకాశాన్ని పోగొట్టుకున్న గంజి చిరంజీవి, తదితర నాయకులతో తెలుగుదేశం పార్టీ మంగళగిరిలో దుర్భేద్యంగా ఉంది. చంద్రబాబు పోటీ చేయడానికి మంగళగిరి నియోజకవర్గం కంటే మించినది ఏముంది? చంద్రబాబు మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటే ఆయనతో పోటీ దిగిన ఏ అభ్యర్థిని అయినా గురుక్షేత్రంలో అభిమన్యుడు పరిస్థితే అవుతుంది. పైన పేర్కొన్న నాయకులు, తెలుగు దేశం శ్రేణులు విభేదాలన్న మరిచి, ఒక్క తాటిపై నిలిచి చంద్రబాబు విజయం తమ విజయమే అన్నట్లుగా నిలిచి చంద్రబాబు విజయం కోసం అహరహం అహర్నిశతా శ్రమిస్తారు. చంద్రబాబు మంగళగిరి నియోజకవర్గం నుండి అత్యంత భారీ మెజారిటీతో గెలుస్తారు. రాబోయే ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుండి చంద్రబాబు విజయం మంగళగిరి అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చేస్తుంది. మంగళగిరి తెలుగుదేశం నాయకులారా, చంద్రబాబును నియోజక వర్గ ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత మీదే. ఆల్ ది బెస్ట్!


- హరిణాంక్



మాట్లాడుతున్న చికాపల్లి రమేష్


## కొత్తపల్లి రామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో లైబ్రరి ఏర్పాటు

**రాజధాని వార్తలు,నూతక్కి :** స్థానిక కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతక్కి గ్రామంలో లైబ్రరిని ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు చేయూత, క్రీడాకారులకు ప్రోత్సహించటం, సామాజిక చైతన్యం కలిగించే కార్యక్రమాలు రామయ్య ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నారు. కొత్తగా గ్రామంలో యువతకు, పెద్దలకు అందుబాటులో ఉండాలని గ్రంథాలయంను ఏర్పాటు చేశారు. ఇటీవలే గ్రామం కాలనీలో నుండి 22 మంది పోలీసు కానిస్టేబుల్స్, 5 ఎస్ఐలు సెలక్టు అవ్వంటం ఆనందకరమని ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు చికాపల్లి రమేష్ తెలిపారు. ఆధునిక కంప్యూటర్లు, పుస్తకాలు, ఇంటర్‌నెట్ విద్యార్థులకు అందుబాటులో ఉంచి పోటీ పరీక్షలకు సన్నధమయ్యే విధంగా యువతను మరింత ప్రోత్సహిస్తామన్నారు. యువత కెప్టెన్ కుమార్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంధాలయంను ఉపయోగించుకోవాలన్నారు.



**ఏపీ ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన సీఐడి స్పెషల్ సెల్ ఏర్పాటు చేసిన సంగతి విధితమే. ఈ సెల్ ఏర్పాటు చేసి 6నెలలు గడిచిన సందర్భంగా డీజీపీ ఆర్పీ ఠాగుర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఏపీ ఎన్నార్టీ చైర్మన్ డాక్టర్ రమికుమార్ వేమూరి తదితరులు**

## 'యాత్ర' హైలెట్స్



యాత్ర వైఎస్ఆర్ జీవితంలోని ఒక ముఖ్య ఘట్టం మాత్రమే. వాస్తవ పాత్రలు, సంఘటనలకి సినిమాటిక్ డ్రామా జోడించి, వైఎస్ఆర్ అంతరంగాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. దర్శకుడు మహి వి. రాఘవ్ ఆయనకి ఇచ్చిన నివాళిగా చెప్పుకోవడం సబబు.

అధికార తెలుగుదేశం పార్టీ (సినిమాలో మనదేశం అన్నారు) మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమనిపించినపుడు, 'ఇప్పుడు కాకపోతే ఇక మళ్లీ గెలవలేం. రాజకీయాలు వదిలేయడం తప్ప' అని వైఎస్ రాజశేఖరరెడ్డి బలంగా భావించినపుడు,ముందస్తు ఎన్నికలకి ఏమాత్రం సిద్ధంగా లేని తన పార్టీని గెలిపించుకోవడానికి వైఎస్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం 'పాదయాత్ర'. ఆ పాదయాత్ర చేపట్టడానికి ఆయనని ప్రేరేపించిన సంఘటనలు, ఆ పాదయాత్ర కారణంగా ప్రజల కష్టాలని స్వయంగా తెలుసుకున్న ఉదంతాల సమాహారమే 'యాత్ర'.

'గెలవడం అసాధ్యం' అనే లెవల్ నుంచి ఆయన ఎలా గెలిచారు అనేది యాత్ర ఫోకస్ చేస్తుంది. ఆయన ప్రకటించిన ప్రతి ప్రజా సంక్షేమ పథకం వెనుక ఎలాంటి కారణాలు ఆయనని ప్రేరేపించాయన్నది దర్శకుడు కథనంలో భాగం చేసాడు.

ఎమోషన్స్ ఎంత పండితే, వాటితో ప్రేక్షకులు ఎంత కనక్ట్ కాగలిగితే సదరు దృశ్యాలు అంత పండుతాయి అనిపించే సన్నివేశాలు చాలా వున్నాయి. మమ్ముట్టి అద్భుతమైన అభినయానికి తోడు, ఆయా సన్నివేశాల్లో కనిపించిన సహజత్వం వాటిని చాలా ఎఫెక్టివ్‌గా తెరమీదకి తీసుకొచ్చింది. వృద్ధాప్య పించన్లు అందని వృద్ధులు తమ గోడు వెళ్లబోసుకునే సన్నివేశంలో **'ఊళ్లో పది మందికే నెలకి డెబ్బయ్ అయిదు రూపాయల పించను వస్తోంది. ఆ పది మందిలో ఒకరు పోతే మనకి ఆ డబ్బులొస్తాయని మరొకరి చావుకోసం ఎదురు చూడాల్సి వస్తోంది'** లాంటి కదిలించే సంభాషణలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి.

మరో సన్నివేశంలో మాట్లాడలేకపోతున్న **'రైతు' గోడు వింటోన్న రాజశేఖరరెడ్డితో 'అతను మాట్లాడలేడు' అని డాక్టర్ చెబుతోంటే... 'నాకు వినబడుతోందయ్యా' అనడం.. 'నేను విన్నాను, నేనున్నాను'** అంటూ రైతులకి భరోసా ఇవ్వడం లాంటి సన్నివేశాల్లో డ్రామా చక్కగా పండింది. ఎమోషనల్ సన్నివేశాల్లో తక్కువ మాటలతో ఎక్కువ అర్థాన్ని, భావోద్వేగాన్ని పలికించిన తీరు మెప్పిస్తుంది. రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం వెనుక ఒక కథని దర్శకుడు చెప్పాడు.

హైకమాండ్‌ని కమాండ్ చేసే నాయకుడన్నట్టు చూపించడం, ఆయన ఏనాడూ పార్టీ అధిష్టానాన్ని లెక్క చేయలేదన్నట్టుగా చిత్రీకరించడం సినిమాటిక్‌గా వైఎస్‌ని ఎలివేట్ చేయడానికే.. ఆయన డైనమిజమ్ అభిమానుల్ని ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు. తెలుగుదేశం పార్టీపై సెటైర్లు కూడా బాగానే పేలాయి.

యాత్రకి సంబంధించి దర్శకుడు మహి వి. రాఘవ్ ఫస్ట్ సక్సెస్ ఏమిటంటే... వైఎస్ పాత్రకి మమ్ముట్టిని ఎంచుకోవడం. వైఎస్ఆర్‌లా 'నటించాలని' కాకుండా, ఆ పాత్ర తాలూకు భావోద్వేగాలని మాత్రమే పలికించిన విధానం, ఆ పాత్రకి ఆయన తీసుకొచ్చిన హుందాతనం వేరొకరి వల్ల కాదనిపిస్తుంది. చివర్లో వైఎస్ఆర్ నిజ రూపం కనిపించే వరకు మమ్ముట్టినే మనకి తెలిసిన వైఎస్ అని భ్రమ పడేంత అద్భుతంగా ఈ పాత్రని పోషించారు. సాంకేతికంగా ఇంకా ఉన్నతంగా తెరకెక్కించి వుంటే బాగుండేదనిపిస్తుంది.

రాజకీయ పరంగా విబేధించే వాళ్లని మినహాయిస్తే సినిమా పరంగా భావోద్వేగాలు, డ్రామా పండించే విషయంలో యాత్ర విజయవంతమయింది. యాత్రలో అక్కడక్కడా ఒడిదుడుకులు వున్నా ఒక రాజకీయవేత్త మాస్ లీడర్‌గా ఎదిగిన విధానాన్ని డాక్యుమెంట్ చేసిన విధానం ఓవరాల్‌గా మెప్పిస్తుంది.

- ఖాన్

## సెర్బ్ డి.ఎస్.టి ప్రాజెక్ట్‌కి సతీష్ ఎంపిక



**రాజధాని వార్తలు గుంటూరు :** కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల అనగానే మనకి గుర్తొచ్చేది చక్కని వాతావరణం, నాణ్యతతో కూడిన చక్కని విద్య. ఐతే ఇటీవల కాలేజ్‌లో సివిల్ డిపార్ట్మెంట్ నందు డా.ఎం.సతీష్ కుమార్ అనే అధ్యపకుడికి సెర్బ్ డి.ఎస్.టి ప్రాజెక్ట్‌కి ఎంపిక అయ్యారు. కనుక సెర్బ్ సంస్థ వారు కొంత ఫండ్ ని స్పాన్సర్ చేసి రీసెర్చ్ లో భాగంగా అధ్యపకుడిని ప్రోత్సహించారు. ఐతే మార్చి నెలలో 12 మరియు 13 వ తేదికు డా.ఎం.సతీష్ కుమార్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ గా నేషనల్ వర్క్ షాప్ ని నిర్వహించనున్నారు. కాలేజ్ యాజమాన్యం డా.ఉమ శంకర్ రెడ్డి , ప్రిన్సిపాల్ డా.బి.ఎస్.బి.రెడ్డి, సివిల్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డా.రవికుమార్ రెడ్డి కాలేజీ నందు నిర్వహిస్తున్న అధ్యాపకుడిని ప్రోత్సహిస్తూ ఈ మంగళవారం వర్క్ షాప్ కి సంబంధించి బ్రోచర్ విడుదల చేసారు. ఈ వర్క్ షాప్‌కు ఇతర రాష్ట్రాల విద్యార్థులు, అధ్యాపకులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. ఫేస్బుక్ లాంటి మాధ్యమాల్లో వర్క్ షాప్ పై స్పందన పట్ల సహా ఉపాధ్యాయులు, ఆర్గనైజింగ్ కమిటీ కూడా సంతోషం వ్యక్తం చేశారు.

- కిరణ్ కుమార్ గుంటూరు

# వెనిజులాపై అగ్రరాజ్యాల అక్కసు





అగ్రరాజ్యం అమెరికా కుటిల,కుయుక్తులకు అనేక చమురు నిల్వలున్న ఇరాక్, సిరియా, లెబనాన్‌లు మరుభూములుగా మారాయి. ఏదేశంలో సహజవనరులు ఉన్నా చేజిక్కించుకునేందుకు సామ,దాన, దండోపాయాలను అమలు చేసే అమెరికా వెనిజులాపై పంజావిసిరింది. అక్కడ అపారమైన చమురు, సహజవాయు నిక్షేపాలు ఉండటమే కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అక్కడి భూగర్భంలో పసిడి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. అపురూపమైన వజ్రాలకు అది పెట్టింది పేరు. ఇంత సంపద ఉన్నప్పుడు ఎవరికైనా కన్నుకుట్టడం సహజం. పైగా ఆ దేశంలో వరసగా వచ్చిన ప్రభుత్వాలను గుప్పెట్లో పెట్టుకుని, అక్కడి సంపదను కొల్లగొట్టడం అలవాటు చేసుకున్న అగ్రరాజ్యాలకు 1999లో మొదటిసారి హ్యూగో చావెజ్ రూపంలో పెను సవాలు ఎదురైంది. ఆ దేశంలో రెండు ప్రధాన పార్టీలు ఎప్పుడూ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటూ... ఒకరి తర్వాత మరొకరు పీఠం ఎక్కుతూ సహజ వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెడుతున్న తరుణంలో చావెజ్ ఆ రెండు పార్టీలకూ వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించాడు. 19వ శతాబ్దిలో స్పెయిన్ వలస దేశాలను ఏకం చేసిన వెనిజులా జాతీయ యోధుడు సైమన్ బొలివర్‌ను ఆదర్శంగా తీసుకుని కుమ్మక్కు రాజకీయాలపై కత్తి దూశాడు. 1999 అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించి మొదలుకొని 2013లో మరణించేవరకూ ఆయన అధికారంలో కొనసాగారు. కేన్సర్ వ్యాధితో అంతిమ దశలో ఉండగా తన వారసుడిగా నికోలస్ మదురోను ప్రకటించారు. అదే ఆయనకు బలంగా మారింది. పాలనా సామర్థ్యంలో చావెజ్‌తో సరి తూగకపోయినా... అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు గణనీయంగా పడిపోయి ఇబ్బందులు తలెత్తినా ఉన్నంతలో మదురో మెరుగైన పాలనే అందించారు.

> **వెనిజులా ఎన్నికల ప్రక్రియ అత్యంత పకడ్బందీగా ఉంటుంది. ఎన్నికలకు ముందు... అవి కొనసాగుతుండగా... పూర్తయ్యాక- ఇలా మూడు దఫాలుగా 18సార్లు ఈవీఎంలను తనిఖీ చేసే ప్రక్రియ తప్పనిసరి. ఇందులో యాదృచ్ఛికంగా ఎంపిక చేసే 53శాతం ఈవీఎంలను పరీక్షిస్తారు. ఈ ప్రక్రియనంతటినీ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. దొంగ ఓట్లకు అక్కడ ఆస్కారం ఉండదు.**

2015లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో సైతం ఆయనే విజయం సాధించారు. వాస్తవానికి తదుపరి ఎన్నికలు ఈ ఏడాది చివరిలో జరగాల్సి ఉంది. కానీ విపక్షాల డిమాండ్‌కు తలొగ్గి నిరుడు మే నెలలో... అంటే 19 నెలల ముందు అధ్యక్ష ఎన్నికలు జరిపారు. ఆ ఎన్నికల్లో 67.84 శాతం ఓట్లు సాధించారు. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని వివిధ దేశాల నుంచి పరిశీలకులుగా వచ్చిన 150మంది సంతృప్తి వ్యక్తం చేశారు. అందులో 8 దేశాలకు చెందిన 14మంది ఎన్నికల అధికారులు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. పైగా

ఓటరు వేలిముద్రే అతడి/ఆమె గుర్తింపు కార్డు. అన్నిటికన్నా ముఖ్యమేమంటే... మదురో ప్రత్యర్థులెవరూ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించలేదు. దేశానికి అతిపెద్ద ఆదాయ వనరు అయిన చమురుధరలు కనిష్టస్థాయికి పడిపోవడంతో వెనిజులా ఆర్థిక ఇబ్బందులకు లోనై ఒడిదుడుకుల్లో ఉన్నమాట వాస్తవమే. కానీ ఆ ఒడిదుడుకులన్నీ అమెరికా ప్రాపకంతో సాగుతున్న దిగ్బంధం పర్యవసానంగా, ఏర్పడ్డాయి. ఒబామా హయాంలో మొదలైన ఆంక్షలు ట్రంప్ వచ్చాక మరింత పెరిగాయి. వీటి విలువ దాదాపు 600 కోట్ల డాలర్లు. ఇవిగాక వెనిజులాకు దక్కాల్సిన చమురు సంస్థ లాభాలు 100 కోట్లను బదిలీ కాకుండా అమెరికా అడ్డగించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో వెనిజులాకు ఉన్న 120 కోట్ల డాలర్ల బంగారం నిల్వలు స్తంభింపజేసింది. దేశంలో నిత్యావసరాల కొరత, ఆకాశాన్నంటిన ద్రవ్యోల్బణం సరేసరి.

ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత జువాన్ గాయిడో తనకు తాను దేశాధ్యక్షుడిగా ప్రకటించుకొన్నారు. తాను తాత్కాలిక అధ్యక్షుడినేననీ, వెంటనే నిష్పాక్షికంగా ఎన్నికలు జరుపుతానని ప్రకటించాడు. మదురోను వదిలి వచ్చిన మిలిటరీ, ఇతర పౌర అధికారులకు క్షమాభిక్ష పెడతామని పార్లమెంటు ప్రకటించింది. ఇదంతా మదురో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా పన్నిన ఎత్తుగడలేనని స్పష్టమవుతోంది.గాయిడో అధ్యక్షుడిగా ప్రకటించుకున్న వెంటనే అమెరికా అతనికి మద్దతు అనుకూల ప్రభుత్వాలు కూడా గాయిడోకు మద్దతు ప్రకటించాయి. అమెరికా చర్యలను రష్యా, టర్కీ ఖండిస్తే, క్యూబా, మెక్సికో, బొలీవియా దేశాల నేతలు మదురోకు మద్దతుగా నిలిచారు. ఈ పరిస్థితుల్లోనే దేశ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. మదురో అధ్యక్ష స్వీకారం చెల్లదంటూ కొద్దిరోజుల కిందట పార్లమెంటు చేసిన తీర్మానం చెల్లదనీ, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిన పార్లమెంటు చేసిన నేరపూరితంగా వ్యవహరించారో లేదో దర్యాప్తు చేయాలని ఆదేశించింది.

బొలివేరియన్ విప్లవానికి కీలకమైన వెనిజులాను దెబ్బతీయడానికి అమెరికా అనేక ఏళ్లగా విఫల ప్రయత్నాలు చేస్తూనే ఉంది. లాటిన్ అమెరికాలో వామపక్షం అధికారంలో ఉన్న దేశాల్లో వెనిజులా ఒకటి.

> **అవసరమైతే సైనిక జోక్యానికి వెనకాడమని అమెరికా ప్రకటించింది. అదే జరిగితే మరింత సంక్షోభం తప్పదని రష్యా హెచ్చరించింది.**


హ్యూగో ఛావెజ్ హయాంలోనూ ఆయనను గద్దె దించేందుకు అమెరికా నానా కుట్రలు, కుయుక్తులు పన్నింది. అమెరికన్ ఆయిల్ కంపెనీలను జాతీయం చేయడంలో, అమెరికా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన ఏనాడూ వెనుకాడింది లేదు. క్యూబాకు అండగానూ నిలిచారు. క్యూబా కష్టకాలంలో ఉన్నప్పుడు పంచదారను, చమురు సరఫరా చేసి ఆదుకున్నారు. కాస్ట్రోతో చేయి కలిపి యావత్ లాటిన్ అమెరికాను ఉత్తేజపరిచారు.ఎగుమతులు దెబ్బతినడంతో, ఆహారం, మందుల కొరత తలెత్తింది. ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. వెనిజులాలో అశాంతి సృష్టించడానికి అమెరికా ప్రతిపక్షాలను రెచ్చగొట్టింది. దీంతో పార్లమెంటు ఒక తీర్మానం చేసి జువాన్ గాయిడోను అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. వెనిజులా ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయాలంటూ 46దేశాలకు పార్లమెంటు లేఖలు రాసింది. అయితే పార్లమెంటు నిర్ణయాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

> **ఈ క్రమంలో అమెరికా మరిన్ని ఆంక్షలు విధించేందుకు కసరత్తు చేస్తోంది. పార్లమెంటు తీర్మానాన్ని అమెరికా, కెనడా, బ్రెజిల్‌లు అభినందించడం ద్వారా గాయిడోను గుర్తించినట్లయింది. ఆయన నియమించే రాయబారులను గుర్తిస్తామని కూడా వెల్లడించాయి. అంటే వెనిజులాలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపేందుకు అమెరికా వ్యూహ రచన చేస్తున్నట్లు స్పష్టమైంది.**

తిరుగుబాటు ద్వారా మదురోను బర్తరఫ్ చేయాలని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో ఒక ప్రకటనలో వెనిజులా సైన్యానికి విజ్ఞప్తి చేశారు. మదురో పాలనలో తలెత్తిన ఆర్థిక పరిస్థితులపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉన్నా, ప్రతిపక్షాలపై మాత్రం వారికి సానుభూతి లేదు. అమెరికా, దాని మిత్రదేశాల మద్దతుతో దేశాధ్యక్షుడితో ఘర్షణకు దిగుతున్న ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా కూడా ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించడమే ఇందుకు రుజువు. సైన్యం 90 శాతం మదిరోకు మద్దతుగా నిలుస్తోంది. అయితే ప్రభుత్వ అనుకూల-ప్రతికూల ఆందోళనలలో వెనిజులాలో యుద్ధవాతావరణం నెలకొంది. అంతర్జాతీయ సమాజం మేల్కొని వెనిజులాకు మద్దతుగా నిలవాల్సిన అగత్యం ఏర్పడింది.

– ఖాన్

# గుండెల్లో గుచ్చి..గుచ్చి చంపకే..









కన్నుగీటి కుర్రకారును బేజారెత్తించిన మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్‌కు కోటి మంది వ్యూయర్స్ ఉన్నారు. అంతేకాదు ఇప్పటికీ ఆమె కోసం నెట్‌లో సెర్చ్ చేసేవారు అంతకంతకు ఎక్కువగుతున్నారు. ఆమె నటించిన 'ఒరు ఆదార్ లవ్' చిత్రాన్ని తెలుగులో 'లవర్స్ డే' పేరుతో డబ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజున ఈ మూవీని విడుదల చేస్తున్నారు. ఒమర్ లులు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో సియాద్ షాజహాన్, రోషన్ అబ్దుల్ రహూఫ్, నూరిన్ షిరీఫ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

'ఏంటి?.. ఏమీ లేదు.. ఏమీ లేదా!.. ఇది చెప్పడానికేనా నన్ను రమ్మన్నావు.. అది మన మధ్య.. మన ఇద్దరికీ ఇంత త్వరగా సెట్ అవుతుందని నేను అనుకోలేదు.. అయ్యా..సెట్ అయిందా ? ఏం సెట్ అయింది. మరి నిన్న నాకు ఎందుకు సైట్ కొంటావ్.. నేనా' అంటూ రోషన్, ప్రియా వారియర్ మధ్య వచ్చే సన్నివేశాలు సినీ ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. షాన్ రెహమాన్ అందించిన బ్యాగ్‌గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంది. సుఖీభవ సినిమాస్ పతాకంపై ఎ.గురురాజ్, సి.హెచ్. వినోద్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. మలయాళం, కన్నడ, తమిళ, తెలుగు భాషల్లో ఒకే రోజు విడుదల కానున్న ఈ సినిమాకోసం కుర్రకారు ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే అనేక కోర్టు కేసులను ఎదుర్కొన్న ఆమె ఎట్టకేలకు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఈనెల 14న విడుదలకు సిద్ధమైంది. ప్రియావారియర్ నటించిన 'శ్రీదేవి బంగ్లా 'విడుదలకు ముందే మళ్లీ కోర్టులో కేసు నమోదు అయింది. ఇది ప్రముఖ నటి శ్రీదేవి అనుమానాస్పద మృతికి సంబంధించిన దృశ్యాలు ఉండటంతో బోనీకపూర్ కోర్టులో కేసు దాఖలు చేశారు.

కన్నుగీటడం ద్వారా రాత్రికిరాత్రే సెలబ్రిటిగా మారిన ప్రియ హిందీ సినిమాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చి, జాన్వికపూర్, అలియాభట్, శ్రద్ధాకపూర్, సారా సరసన చేరనుంది. అయితే వారంతా తనకంటే సీనియర్లని బాలీవుడ్‌లో కొంచెం చోటు దక్కించుకునేందుకే ప్రయత్నిస్తున్నానని ప్రియా వెల్లడించారు. కన్నుగీటే పిల్లగానే ప్రజలు గుర్తుంచుకోవడం ఇష్టంలేదని, త్వరలో మంచి నటిగా కూడా గుర్తింపుపొందాలన్నదే తన ధ్యేయమని ఆమె చెబుతున్నారు.

1999 అక్టోబర్ 28న కేరళలోని త్రిషూర్‌కు చెందిన పున్నకున్నమ్‌లో పుట్టిన ప్రియావారియర్ చదువుకుంటూనే మోడలింగ్ చేసేవారు. ఆమె తండ్రి ప్రకాష్ వారియర్ కేంద్ర ఎక్సైజ్ శాఖలో ఉద్యోగికాగ, తల్లి గృహిణి. త్రిషూర్‌లోని విమల కాలేజ్‌లో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నఆమె మొదట మ్యూజిక్ వీడియో 'నీ వాన్నం నాన్ మజాయ్' ద్వారా పరిచయమై 'ఒరు అదారు లవ్' లో కన్నుగీటడం ద్వారా దేశానికి తెలిశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు కోటిన్నర మంది ఫాలోవర్లు ఉన్నారు. హాలీవుడ్ నటుడు కేలీ జెన్నర్, క్రిస్టియానో రోనాల్డోల తర్వాత అత్యధిక ఫాలోవర్లు ఉంది ప్రియావారియర్‌కే. ఫేస్‌బుక్‌లో ఆమెకు 45 వేల మంది ఫాలోయర్లు ఉన్నారు.

ఒమర్‌లాలూ దర్శకత్వంలోని ఒరు అదార్ లవ్ విడుదలకు ముందే రణధీర్ కపూర్‌తో 'ఏ దిల్ హై ముష్కిల్'తో నటించనున్నారు. ఆమె నటించిన 'మెర్సల్ ' వీడియోతో విజయ్ ఫ్యాన్స్‌కు దగ్గరైంది. ఇప్పటికే అనేక అవకాశాలు దక్కించుకుంటున్న ప్రియ 'ఉరి' సినిమా ద్వారా బాలీవుడ్‌కు పరిచయమయ్యారు. కోటి రూపాయల పారితోషికం పుచ్చుకుంటున్న ఈమె 'సింబా'లో సారా పటౌడీతోపాటు మరొక హీరోయిన్‌గా నటిస్తారన్న వార్తలు వస్తున్నాయి. సంజయ్‌లీలా బన్సాలీ చిత్రంలో నటించాలని ఉందన్న ఆమె చదువుతోపాటు, నటన, మోడలింగ్, గాయనిగా బిజీగా ఉన్నారు.

## ముస్లింమేతర పౌరసత్వానికి నిరసనగా

# రగులుతున్న ఈశాన్యం









2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేశప్రజలను రెండుగా విభజించి లౌకికతత్వాన్ని సమాధి చేసింది. దీన్ని మరింత ఖచ్చితంగా అమలు చేసేందుకు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ల నుంచి 2014 డిసెంబరులోపు దేశంలో ప్రవేశిచించిన ముస్లిమేతరులైన హిందూ, సిక్కు జైన, బౌద్ధ, క్రైస్తవ, పార్సీ) వర్గాల పౌరులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఉద్దేశించినదీ బిల్లు. శాసనపరమైన ఏ చర్య తీసుకున్నా ప్రజామోదాన్ని ప్రమాణికం చేసుకొవడం ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల కనీస బాధ్యత. అందుకు విరుద్ధంగా మోడీ సర్కారు పౌరసత్వ సవరణ బిల్లును ముందుకు తీసుకుపోతోంది. ప్రభుత్వ తీరుకు నిరసనగా అసోం ర్యాలీలు, బంద్‌లతో అట్టుడికిపోతుంది. అసోంతోపాటు మేఘాలయ, మిజోరంలలో కూడా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సవరణ బిల్లు ఈశాన్య ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని ప్రకటించారు. త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్, మణిపూర్‌లలో కూడా నిరసనలు రాజుకున్నాయి. ఈ బిల్లును తొలిసారిగా 2016లో పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు అసోంలోని వివిధ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపారు. జేపీసీలో ఎక్కువమంది బీజేపీ వారే ఉండడంతో ఆ పార్టీ ఆశించిన విధంగానే ఆ బిల్లు తిరిగి పార్లమెంటుకు వచ్చింది. దాన్ని లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభ ఆమోదం పొందాల్సి ఉంది. ఒకపక్క జాతీయ పౌర గుర్తింపు (ఎన్ఆర్‌సీ) వ్యవహారం ఒక కొలిక్కిరాకుండానే ఈ పౌరసత్వ సవరణ బిల్లును రంగంలోకి తేవడం బీజేపీ అధినాయకత్వం ఎంత మూర్ఖంగా వ్యవహరిస్తున్నదో తేటతెల్లం చేస్తున్నది. ఈ బిల్లు ప్రకారం 2014 చివరినాటికి పై మూడు దేశాల నుంచి దేశంలోకి ప్రవేశించిన వారికి పౌరసత్వం దక్కుతుంది. అయితే ముస్లింలకు తప్ప. ఈ బిల్లు కారణంగా కోటి మంది అక్రమ వలసదారులు స్థిరపడిపోతారని అసోం ఆగ్రహం. వాస్తవానికి అక్రమ వలసలకు వ్యతిరేకంగానే 1979-85 మధ్య అసోం ఉద్యమం సాగింది. చివరకు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకి, అసోం ఉద్యమకారులకూ మధ్య 1985లో ఒప్పందం కుదిరి ఉద్యమం చల్లబడింది. ఈ ఒప్పందం ప్రకారం అక్రమ వలసలను నిర్ధారించడానికి 1971ని ప్రాతిపదిక సంవత్సరంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు కూడా 1951నాటి ఎన్ఆర్‌సీ జాబితాను అప్‌డేట్ చేసి అసలు పౌరులు ఎవరో తేల్చాలని ఆదేశించింది. ఒప్పందంలోని తేదీ ప్రాతిపదికగానే అసోంలోకి వచ్చిన బంగ్లాదేశీయులందరినీ విదేశీయులుగా గుర్తించాలని 2015లో మోడీ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. కానీ, 2016లో ఇందుకు భిన్నంగా పొరుగుదేశాల నుంచి వలస వచ్చిన హిందువులకు భారత పౌరసత్వం ఇచ్చేలా పౌరసత్వ సవరణ బిల్లును ప్రతిపాదించింది.

> **అసోంలో అక్రమ వలసలకు వ్యతిరేకంగా సాగిన మాట వాస్తవమే అయినా దానిలో కేవలం ముస్లిం వ్యతిరేకతను మాత్రమే చూడడం బీజేపీ హిందూత్వ భావనకు, దాని కుట్రకు నిదర్శనం. అది జాతి సమస్య. వారు వ్యతిరేకిస్తున్నది విదేశీయులను తప్ప, ముస్లింలను కాదు. లౌకిక దేశంలోకి ఒక వ్యక్తి అక్రమ ప్రవేశాన్ని మతం ప్రాతిపదికన తూచడాన్ని న్యాయస్థానాలు సైతం సమర్థిస్తాయని భావించాల్సిన పనిలేదు. ఎన్ఆర్‌సీలో కూడా మత కోణం లేదు. తగిన ఆధారాలుంటే పౌరులుగా గుర్తింపు పొందవచ్చు.**

> **పౌరసత్వ సవరణ దేశ విభజన తప్పుల ప్రాయశ్చిత్తం. నిజమైన పౌరులకు పౌర జాతీయ జాబితా (ఎన్.ఆర్.సి.)లో చోటు దక్కుతుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఆయన ఉద్దేశ్యంలో నిజమైన పౌరులు హిందువులే. 2019 లో మోడీ ఎన్నికవగానే కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా, అస్సాం నుంచి గుజరాత్ వరకు అక్రమ వలసదారులుండరని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు మరిచిపోరు. అంటే హిందు వలసదారులు భారత పౌరులవుతారు. ముస్లింలు వెలివేయబడతారు!**

> **పౌరసత్వ సవరణలో ముస్లింలను వదిలేయటం రాజ్యాంగవిరుద్ధం. ఎన్.ఆర్.సి. పరమతస్తులపై బీజేపీ ఝుళిపించిన జాతీయవాద కొరడా. దేశ ప్రగతికి రక్తమాంసాలు అర్పిస్తున్న శ్రమజీవులను దేశబహిష్కరణ చేయడం అమానుషం. హిందూ ఓట్లతో నెగ్గటం, భారత్ ను హిందూ దేశంగా మార్చటం బీజేపీ దీర్ఘకాల లక్ష్యం. దీనిని నిజమైన జాతీయవాదులంతా ఒక్కటై ఎదుర్కోవలసిన సమయం ఆసన్నమైంది.**

విదేశీయులకు పౌరసత్వం మంజూరును భారత రాజ్యాంగంలోని 5 నుంచి 11వ అధికరణలు నిర్దేశిస్తున్నాయి. ఐదో అధికరణ ప్రకారం భారత రాజ్యాంగం అమలులోకి రావడానికి కనీసం ఐదేళ్లకు తక్కువ కాని కాలం నుంచి దేశంలో ఉన్న వారందరికీ పౌరసత్వం లభిస్తుంది. 8వ అధికరణం ప్రకారం తల్లిదండ్రులు, తాతలు ఈ దేశంలో జన్మించిన వారై విదేశాల్లో ఉంటున్న ఎవరైనా భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకొవచ్చు. 1987 జూలై1 తర్వాత భారత్‌లో పుట్టినవారి తల్లిదండ్రులలో ఒకరైనా భారతీయులు కాకపోతే వారికి భారత పౌరసత్వం లభించదు. తమకుతాముగా ఏ విదేశీ పౌరసత్వం స్వీకరించినా ఇక్కడి పౌరసత్వం కోల్పోతారని రాజ్యాంగంలోని తొమ్మిదో అధికరణ స్పష్టంచేస్తున్నది. ఏ ఒక్క నిబంధన కూడా పౌరసత్వానికి మతాన్ని ప్రాతిపదికగా చేయలేదు. కానీ బీజేపీ ఈ బిల్లును మతంతో ముడిపెడుతోంది.ప్రస్తుత పౌర జాతీయ జాబితాలో చోటు దక్కని 8 లక్షల హిందువులు దీనితో భారత పౌరులవుతారు. పౌరసత్వ సవరణ జరక్కపోతే అసోం పాకిస్తాన్ భాగమవుతుంది. 17 శాసనసభ స్థానాలు పోతాయంటూ రాష్ట్ర బీజేపీ ఆర్థికమంత్రి హిమంత బిశ్వ శర్మ హెచ్చరించడం కొసమెరుపు.

పెద్ద సంఖ్యలో వలసదారులకు అధికారికంగా భారత పౌరసత్వం దక్కితే స్థానిక భాషలు, సంస్కృతి, ఆర్థిక సామాజిక రంగాలు ఛిద్రమైపోతాయన్న భయందోళనలతో వారు ఉద్యమ బాట పట్టారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా చేసుకున్న ఒప్పందం పూర్తిగా అమలుకాకపోగా, మోడీ ఈ తాజా బిల్లుతో తమ భవిష్యత్తును నాశనం చేస్తున్నారనే ఆందోళనలో ఉన్న అస్సామీయులు ఆగ్రహా వేశాలకు లోనవుతున్నారు. నష్ట నివారణలో భాగంగా బీజేపీ పాలకులు చేస్తున్న ప్రకటనలు కూడా వివాదాన్ని మరింత రాజేస్తున్నాయి. అసోం ఒడంబడికలోని ఆరోషరతు ప్రకారం - స్థానికుల రాజకీయ హక్కుల పరిరక్షణకు కేంద్రం కట్టుబడి ఉందనీ, 371 రాజ్యాంగ అధికరణను వర్తింపజేసి పార్లమెంటరీ, శాసనసభ నియోజకవర్గాల్లో స్థానికులకు కోటా కట్టబెడతామంటోంది.

– బోస్

## సీఎం రమేశ్‌కు వాట్సాప్ షాక్




**రాజధాని వార్తలు, అమరావతి:** తెలుగుదేశం పార్టీ ఎంపీ సీఎం రమేశ్ వాట్సాప్ ఖాతాను ఆసంస్థ యాజమాన్యం నిలిపివేసింది. సేవలు వినియోగించుకునే హక్కు కోల్పోయారని పేర్కొంది. మీరు మా సంస్థ నియమ నిబంధనలు ఉల్లంఘించారు. మీపై చాలా ఫిర్యాదులు అందాయి. అందుకే మీ నంబర్‌కు వాట్సాప్ సేవలు నిలిపివేస్తున్నాం అని రాజ్యసభ సభ్యుడు సి.ఎం.రమేష్‌కు వాట్సాప్ సంస్థ సమాధానమిచ్చింది. టీడీపీ సీనియర్ నేత రమేష్ వాట్సాప్ ఖాతాను ఆ సంస్థ బ్యాన్ చేసిందని తాజాగా వెల్లంది. ఇటీవల కాలంలో తన వాట్సాప్ ఖాతా పనిచేయక పోవడంతో సీఎం రమేష్ సంస్థకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సంస్థపై విధంగా సమాచారం ఇచ్చింది. అయితే ఫిర్యాదుదారుని వివరాలు మాత్రం వాట్సాప్ నిర్వాహకులు బయటపెట్ట లేదు. వినియోగదారుల వ్యక్తిగత గోప్యత కాపాడే చర్యల్లో భాగంగా ఆ వివరాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. కాగా, కేంద్ర ప్రభుత్వమే తన ఖాతాను బ్యాన్ చేయించిందని సీఎం రమేష్ ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దూరం పెరిగిన తర్వాత రోజురోజుకూ టీడీపీ, బీజేపీ మధ్య మాట యుద్ధం పెరిగింది. ఇలాంటి సమయంలో రమేష్ ఖాతా నిలిపి వేయడం చర్చనీయాంశంగా మారింది. తన ఖాతా పనిచేయట్లేదని వాట్సాప్ సంస్థకు సీఎం రమేశ్ లేఖ రాయడంతో ఈ మేరకు ఆ సంస్థ ఈ విధంగా బదులచ్చింది. లేఖలో తానో రాజ్యసభ సభ్యుడిని అనే విషయాన్ని కూడా సీఎం రమేశ్ పేర్కొన్నారు. వాట్సాప్ ఖాతా తొలగింపు వెనుక కేంద్ర ప్రభుత్వ చర్యలే కారణమని సీఎం రమేశ్ ఆరోపించారు. తన ఫోను, వాట్సాప్‌పై కేంద్రం నిఘా పెట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తంచేశారు.




**విజయవాడలోని నోవాటెల్ హోటల్ లో సీఐఐ, సీఆర్‌డీఏ ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 13-15 తేదీల్లో ఆనంద నగరాల సదస్సు జరగనుంది.**




Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com